# సాక్షి శ్రీకాకుళం

సోమవారం । 6 । జనవరి । 2025




## కార్గో కార్చిచ్చు

ఉద్దానంలో కార్గో కార్చిచ్చు అంటుకుంటోంది. గ్రామాలు ఉద్యమం వైపు నడుస్తున్నాయి.

- 8లో



## కొలువు లేక.. జీతం అందక

జీఆర్‌పీయూ ఔట్‌సోర్సింగ్ సిబ్బంది తిప్పలు పడుతున్నారు. జీతం అందక యాతన అనుభవిస్తున్నారు.

- 8లో

## న్యూస్‌రీల్

### టెక్కలిలో మినీ జాబ్‌మేళా రేపు

**టెక్కలి:** ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మినీ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి నుంచి డిగ్రీ వరకు ఉత్తీర్ణత సాధించి 18 నుంచి 45 ఏళ్ల వయసు కలిగిన నిరుద్యోగ యువత కోసం ఈ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఆమె వెల్లడించారు. ఉదయం 9.30 గంటల నుంచి నిర్వహిస్తున్న ఈ జాబ్‌మేళాకు హాజరయ్యే అభ్యర్థుల విద్యార్హత పత్రాలు, ఆధార్ కార్డు, బయోడేటా పత్రాలు, ఫొటోలతో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 9493290012 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

### కామ్రేడ్ చిలకమ్మకు ఘన నివాళి



చిలకమ్మ స్థూపం వద్ద నివాళి అర్పిస్తున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు

**కాశీబుగ్గ:** భారతదేశంలో సమరశీల ప్రతిఘటన పోరాటాలను నిర్మించడమే శ్రీకాకుళం గిరిజన రైతుల సాయుధ పోరాటమని అలాంటి పోరాట యోధురాలు, ఆదివాసీ వీర వనిత సవర చిలకమ్మ అని సీపీఐ న్యూడెమొక్రసీ జిల్లా కమిటీ కార్యదర్శి తాండ్ర ప్రకాష్ అన్నారు. చిలకమ్మ 29వ వర్ధంతి సందర్భంగా శ్రీకాకుళం జిల్లా మందస మండలం కొండలోగాం ఆదివాసీ గ్రామంలో ఆదివారం ఉదయం 10గంటలకు చిలకమ్మ స్మారక స్తూపం వద్ద కార్యక్రమం నిర్వహించారు. సీపీఐ న్యూడెమొక్రసీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జరిగిన స్మారక సభకు ప్రకాష్ అధ్యక్షత వహిస్తూ మాట్లాడారు. కామ్రేడ్ చిలకమ్మ కనబరిచిన పోరాట స్ఫూర్తిని వివరించారు. అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్ ప్రధాన వక్తగా పాల్గొని మాట్లాడారు. సీపీఐ న్యూమొక్రసీ జిల్లా నాయకులు గొరకల బాలకృష్ణ, ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పోతనపల్లి కుసుమ, వంకల మాధవరావు, పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.వినోద్, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు జుత్తు వీరాస్వామి, బర్ల గోపి, పోతనపల్లి మల్లేశ్వరరావు, పీవైఎల్ జిల్లా కన్వీనర్ సార జగన్, ఏఐకెఎంఎస్ జిల్లా నాయకులు రాపాక మాధవరావు, అరుణోదయ నాయకుడు సొర్ర రామారావు, ప్రజా కళాకారుడు కుత్తుం వినోద్, వంకల పాపయ్య, ఆదివాసి నాయకుడు బంగ్లా కుమార్ తదితరులు మాట్లాడారు.

### బీసీలు ఏకమవ్వాలి




మాట్లాడుతున్న పూర్ణచంద్రరావు

**శ్రీకాకుళం (పీఎన్ కాలనీ):** రాజకీయ ఉనికి కాపాడుకోవటానికి బీసీలు ఏకమవ్వాల్సిన సమయం ఆసన్నమైందని బహుజన్ సమాజ్ పార్టీ ఉత్తరాంధ్ర నేతలు అన్నారు. శ్రీకాకుళం నగరంలో అంబేద్కర్ విజ్ఞాన మందిర్‌లో బీసీ సమన్వయ కమిటీ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అనాదిగా స్థానికేతరులు ఉత్తరాంధ్ర రాజకీయ స్థలాన్ని ఆక్రమించి ఇక్కడి ప్రజల కష్టాలను, ఆకాంక్షలను, అవసరాలను పట్టించుకోకుండా రాజకీయం చేస్తున్నారని ఉత్తరాంధ్ర బీసీ సంఘాల నాయకులు అన్నారు. స్థానికేతరులను తీసుకొచ్చి గెలిపించుకుంటే ఉత్తరాంధ్రకు ఒరిగేదేమీలేదన్నారు. సమావేశంలో బీసీ సంఘాల సమన్వయకమిటీ రాష్ట్ర చైర్మన్ ఎ.పూర్ణచంద్రరావు, కన్వీనర్ బి.సి రమణ, కో కన్వీనర్ కె.శ్రీనివాసయాదవ్, బహుజన సమాజ్‌పార్టీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ రాజారావు, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు ఎల్.గరికివాడు తదితరులు పాల్గొన్నారు.

### 11.43 కిలోల గంజాయితో ఇద్దరు అరెస్టు

**ఇచ్ఛాపురం:** ఒడిశా నుంచి బెంగళూరుకు అక్రమంగా 11.43 కిలోల గంజాయిని రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ పి.దుర్గాప్రసాద్ తెలిపారు. శనివారం ప్రొహిబిషన్ ఎక్సైజ్ సిబ్బంది స్థానిక రైల్వేస్టేషన్ పరిధిలో తనిఖీలు నిర్వహిస్తుండగా ఒడిశా దిగపాండి బ్లాక్‌కి చెందిన లాలుప్రసాద్‌రొట్టి, అదే రాష్ట్రం గంజాం జిల్లా చీకటి బ్లాక్‌కి చెందిన సోనూగౌడ అనే ఇద్దరు వ్యక్తులు పట్టుబడినట్లు ప్రొహిబిషన్ సిబ్బంది తెలిపారు. నిందితుల వద్ద నుంచి గంజాయి, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకొని అరెస్టు చేసినట్లు తెలియజేశారు. వీరికి గంజాయి సరఫరా చేస్తున్న చీకటి బ్లాక్‌కి చెందిన కన్నమహారాణని త్వరలో పట్టుకుంటామన్నారు.

# సర్వేశ్వరా ఇదేం తీరు..!



- భూముల సర్వేపై నాడు అభాండాలు మోపిన టీడీపీ
- నేడు మళ్లీ రీసర్వే ప్రారంభించిన వైనం
- జిల్లాలో 25 గ్రామాల్లో జరుగుతున్న రీ సర్వే
- ఫిబ్రవరి 16 నాటికి పూర్తి చేయాలని నిర్ణయం

**శ్రీకాకుళం పాతబస్టాండ్:**

ఎన్నికల సమయంలో టీడీపీ ప్రచారాలు ఉత్తి అబద్ధాలేనని కూటమి ప్రభుత్వ కార్యకలాపాలు రుజువు చేస్తున్నాయి. భూముల రీ సర్వేపై ఎన్నికల ముందు కళ్లలో నిప్పులు పోసుకున్న టీడీపీ నాయకులు ఇప్పుడు అదే సర్వేను మళ్లీ నిర్వహిస్తున్నారు. నాడు రీ సర్వే వల్ల రైతులకు నష్టం జరిగిపోతోందంటూ ఊరూరా నమ్మబలికిన నాయకులు నేడు ఏ మాత్రం మొహమాట పడకుండా ఆ సర్వేలను కొనసాగిస్తున్నారు. మాట మార్చడం, అబద్ధాలు చెప్పడం కూటమి ప్రభుత్వం నైజమని ఈ తీరు స్పష్టం చేస్తోంది.

**సమస్యలకు చెక్ పెట్టేందుకే..**

రీ సర్వే భూ సమస్యల వివాదాలకు చెక్ పెట్టే పెద్ద కార్యక్రమం. ఈ మహత్తర కార్యక్రమాన్ని మూడేళ్ల కిందట నాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రంలో మొదలుపెట్టారు. సుమారు వందేళ్లుగా సర్వేలకు నోచుకోని భూముల వల్ల మొదలైన వివాదాలకు ముగింపు పలకాలని సర్వేకు శ్రీకారం చుట్టారు. భూముల సమగ్ర సర్వే, సరిహద్దు రాళ్లు ప్రభుత్వ ధనంతో ఏర్పాటు చేసే ప్రక్రియను ప్రారంభించారు. కానీ నాటి ప్రతిపక్షం టీడీపీ ఈ కార్యక్రమంపై లేనిపోని అభాండాలు మోపింది. జనాలకు పదే పదే అబద్ధాలు నూరిపోసింది. ఇప్పుడు అధికారంలోకి రాగానే ఆ రీ సర్వేను మరలా ప్రారంభించింది. అప్పుడే జిల్లాలో కొన్ని మండలాల్లో ప్రాజెక్టు సర్వే పేరిట సర్వేలు ప్రారంభించింది. ఈ తొలివిడత సర్వేలు ఫిబ్రవరి నెలాఖరు నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా తీసుకుంది. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పాత ఎఫ్ఎంబీలు ఆధారంగా భూములు సర్వేలు చేయించి, వారి హద్దులు నిర్ణయించి, ప్రతి విస్తీర్ణానికి విధానాలు పాటిస్తూ సర్వే చేశారు. సరిగ్గా నేటి పాలకులు కూడా అదే విధానాన్ని ఫాలో అవుతున్నారు.

### సగం సర్వే అప్పుడే పూర్తి..

జిల్లాలోని 30 మండలాల్లో 1465 రెవెన్యూ గ్రామాలు ఉండగా వీటిలో గత ప్రభుత్వం హయాంలో 738 గ్రామాల్లో శాస్త్రీయంగా ఆధునిక పరికరాలు ఉపయోగించి కచ్చితమైన రీ సర్వే చేశారు. పొలాల హద్దులకు కూడా ప్రభుత్వ నిధులతోనే సరిహద్దు రాళ్లు వేయించారు. సర్వే నంబర్లతో పాటు ప్రతి భూ కమతానికి ఒక యూనిక్ కోడ్ (ఎల్‌పీ నంబర్)ను ఇచ్చి భూ వివాదాలకు తావు లేకుండా స్పష్టమైన సర్వేను చేయించారు. ఆ ప్రభుత్వం హయాంలోనే సగానికి పైగా రెవెన్యూ గ్రామాలు సర్వేలు పూర్తి చేయడం జరిగింది.

ఇటీవల విజయవాడలో కలెక్టర్ల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రీ సర్వేను నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కలెక్టర్లను ఆదేశించారు. అప్పుడే వారంతా నివ్వెరపోయారు. ఒకప్పుడు సర్వే ఆపాల్సిందేనని ఆందోళన చేసిన వ్యక్తి మళ్లీ మాట మార్చడంపై ఆశ్చర్యపోయారు. మన జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా 25 మండలాల్లో మండలానికి ఒక రెవెన్యూ గ్రామం వంతున సర్వేలు నిర్వహిస్తున్నారు. వీటిని ఫిబ్రవరి నెలాఖరుకి పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించింది.

### నేటి నుంచి సిక్కోలు డ్వాక్రా బజార్

**శ్రీకాకుళం పాతబస్టాండ్:** జిల్లాలో సిక్కోలు డ్వాక్రా బజార్ సోమవారం నుంచి ప్రారంభం కానుంది. ఏడు రోడ్ల కూడలిలోని మున్సిపల్ మైదానంలో స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను ప్రదర్శించి, అమ్మకానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ బజార్‌లో చేనేత వస్త్రాలు, హస్తకళలు, చేతి వంటల ఆహార పదార్థాలు తదితర ఉత్పత్తుల ప్రదర్శన అమ్మకాలు ఉంటాయి. స్వయం సహాయక సంఘాల మహిళల కృషిని ప్రోత్సహించడానికి ఇది మంచి అవకాశమని, ఉత్పత్తుల ప్రదర్శనను తిలకించి వాటిని కొనుగోలు చేయడం ద్వారా జిల్లా ప్రజలు వారిని ఆర్థికంగా కూడా ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు.

### జాతీయ కబడ్డీ పోటీలకు ఐదుగురు ఎంపిక

**శ్రీకాకుళం న్యూకాలనీ:** జాతీయస్థాయి జూనియర్స్ కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలకు ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా నుంచి రికార్డుస్థాయిలో ఐదుగురు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఎంపికైనవారిలో పాలక మణికంఠ (జిల్లేడుపాడు, సీతంపేట మండలం), ముద్దాడ నరేష్ (ముట్టవానిపేట, జలుమూరు మండలం), లామాడి లీసా (పల్లిసారథి, వజ్రపుకొత్తూరు మండలం), సంగారి హర్షిత (పల్లిసారథి, వజ్రపుకొత్తురు మండలం), కందివలస శ్రావణి (నాగంపాలెం, లావేరు మండలం) ఉన్నారు. వీరంతా ఈనెల 8 నుంచి 12వ తేదీవరకు ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని హరిద్వార్ వేదికగా జరిగే జాతీయ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలబాలికల జట్లకు ప్రాతినిధ్యం వహించనున్నారు. ఇటీవలి రావులపాలెంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా బాలబాలికల రెండు జట్లు చాంపియన్లుగా నిలిచిన విషయం తెలిసిందే.

హాజరైన తూర్పు కాపు సంక్షేమ సంఘం సభ్యులు



# ఐకమత్యంగా హక్కులు సాధించుకోవాలి

- తూర్పు కాపుల ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ



తూర్పు కాపు ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ

**టెక్కలి:** తూర్పు కాపులు సామాజికంగా, రాజకీయంగా మరింత అభివృద్ధి చెందాలని, హక్కులు సాధించుకోవడానికి ఐకమత్యంగా ముందుకు సాగాలని శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ ఆకాంక్షించారు. ఆదివారం టెక్కలి సమీపంలో నిర్వహించిన తూర్పు కాపుల ఆత్మీయ సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల ప్రాంతంలో తూర్పుకాపుల ఆత్మీయ సమావేశం నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. తూర్పు కాపుల సంక్షేమానికి నిరంతరం తోడుగా ఉంటానని బొత్స హామీ ఇచ్చారు. అనంతరం తూర్పు కాపు కార్పొరేషన్ చైర్ పర్సన్ పాలవలస యశస్విని మాట్లాడుతూ తూర్పు కాపుల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. అనంతరం సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. అనంతరం చిన్నారులు వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. అలాగే సామాజిక వర్గం వివాహ పరిచయ కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో అతిథులు కిమిడి రామ్‌మల్లిక్ నాయుడు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.మోహన్‌రావు, సభ్యులు డోల జగన్, మామిడి శ్రీకాంత్, పి.చంద్రమోహన్, ఎం.స్వరూప్, ఎం.రామజోగినాయుడు, కె.నారాయణరావు, సుడా చైర్మన్ కొరికాన రవి, కె.రాజేశ్వర్రావు, ఎ.రామకృష్ణంనాయుడు, పి.వసంతరావు, వి.సత్యన్నారాయణ, వి.కృష్ణచంద్, కె.రమణమూర్తి, శాంతారావు, బి.రాజశేఖర్, టి.బలరాం, పి.చంద్రశేఖర్(కింగ్), పి.డిల్లేశ్వరావ్రు, పి.మోహన్‌రావు, ఎస్.రాజు, ఆర్.జయమోహన్‌ తో పాటు తూర్పు కాపు సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.



## చిలకమ్మా.. చిక్కిందంట

రంగుల్లో కనిపిస్తున్న ఈ చేప పేరు చిలక. ఇది చాలా అరుదుగా మత్స్యకారులకు దొరుకుతుంది. జనవరి నెలలో కోనేం చేపలు పడే సమయంలో ఈ అరుదైన చేప సముద్రంలో లభిస్తుందని మత్స్యకారులు చెబుతున్నారు. ఆదివారం డొంకూరుకు చెందిన మత్స్యకార మహిళ ఈ చేపను ఉద్దానం ప్రాంతంలో వెయ్యి రూపాయలకు విక్రయించారు. రంగుల చేపను చూసేందుకు అంతా ఆసక్తి ప్రదర్శించారు.

- ఇచ్ఛాపురం రూరల్

## ప్రాధాన్యం ఇదేనా..?



పలాస ఏఎంసీ మార్కెట్ యార్డు ఎదురుగా ఉన్న రైస్ మిల్ వద్ద ధాన్యం రైతులు ట్రాక్టర్లతో గంటల తరబడి నిరీక్షిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన రైతులు పేపర్ వర్క్ చేయలేకపోతుండడంతో ధాన్యం విక్రయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అధికారులు తక్షణమే స్పందించి వేగవంతంగా ప్రాసెసింగ్ చేయాలని వారంతా కోరుతున్నారు.

- కాశీబుగ్గ

## పల్లెలో పిడకల వేట



భోగికి పిడకలు సిద్ధం చేసుకునే పనిలో పిల్లలు బిజీ అవుతున్నారు. రణస్థలం మండలంలోని మెంటాడకు చెందిన పిల్లలు ఆదివారం నాడు పశువుల శాలకు వెళ్లి ఇలా పేడ తెచ్చుకున్నారు. వీరి ఉత్సాహం స్థానికులకు ముచ్చటగొలిపింది.

- రణస్థలం

# భారీగా వెండి పట్టివేత



పైడిభీమవరం చెక్‌పోస్టు వద్ద ఆర్టీసీ బస్సులో వెండి తనిఖీ చేస్తున్న ఎస్ఐ చిరంజీవి

**రణస్థలం:** మండలంలోని పైడిభీమవరం చెక్‌పోస్టు వద్ద చేపట్టిన వాహన తనిఖీలో 14 కిలోల వెండిని జేఆర్ పురం ఎస్ఐ ఎస్.చిరంజీవి పట్టుకున్నారు. ఎస్ఐ చిరంజీవి తెలిపిన వివరాలు ప్రకారం.. ఆదివారం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో ఆర్టీసీ బస్సు తనిఖీ చేయగా బరంపురానికి చెందిన పుష్పేంద్ర సింగ్ వద్ద సుమారు 14 కిలోల వెండి పట్టీలు, చైన్లు వంటివి గుర్తించారు. వెంటనే జేఆర్ పురం పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి జీఎస్టీ అధికారులకు సమాచారం అందించారు. నిందితుడు బరంపురం నుంచి శ్రీకాకుళం వచ్చి అక్కడి నుంచి విజయనగరం వెళుతుండగా పైడిభీమవరం వద్ద తనిఖీలో పట్టుకున్నారు. జిల్లా జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ కొండమ్మ వచ్చి పరిశీలించగా వెండికి సంబంధించిన బిల్లులు ఉన్నాయి. అయితే విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్నంలోని బంగారం దుకాణదారుల నుంచి ముందస్తు ఆర్డర్ లేకుండా భారీ మొత్తంలో వెండి తీసుకురావడం చట్టరీత్యా నేరమని గుర్తించారు. దీనిపై జీఎస్టీ అధికారిణి కొండమ్మ మాట్లాడుతూ బిల్లులు ఉన్నా బంగారం దుకాణారుల నుంచి ఆర్డర్లు లేనందున పూర్తి స్థాయి వెండిని లెక్కించి అపరాధ రుసుం విధిస్తున్నట్లు చెప్పారు.

# ముగ్గు.. ముచ్చట



ద్వారాల ముగ్గు

- ధనుర్మాసంలో సంస్కృతి సంప్రదాయాలకు పెద్దపీట
- ముంగిట మెరుస్తున్న ముగ్గులు



ముంగిట మెరిసే ముత్యాల ముగ్గు ధనుర్మాసానికి ప్రతీక. పన్నెండు చుక్కల చక్కటి ముగ్గు వైకుంఠ ద్వారాలకు సూచిక. గుమ్మడికాయ ముగ్గు నెలగంటు వేయాలని చెప్పే వీచిక. రథం ముగ్గు సూరీడికి స్వాగత గీతిక. ఒక్కో ముగ్గుకు ఒక్కో ముచ్చట ఉంటుంది. రంగవల్లులు కేవలం సరదా మాత్రమే కాదు.. మన సంప్రదాయం కూడా.





**శ్రీకాకుళం కల్చరల్:**

ధనుర్మాసం, ముగ్గుల పోటీలు, సంక్రాంతి.. అచ్చమైన తెలుగు పల్లెలకు జన్మదిన వేడుకల్లాంటివి. ధనుర్మాసం ప్రారంభం నుంచి రకరకాల పేర్లతో ముగ్గులను ముంగిట వేయడం సంప్రదాయంగా వస్తోంది. గీతల కొద్దీ నైపుణ్యం తెలుస్తుంది. నైపుణ్యమే కాదు కాస్తో కూస్తో పుణ్యం కూడా మిళితమై ఉంటుంది. ఈ ముగ్గు క్రిమికీటకాదులకు ఆహారం కూడా కదా. ముగ్గులో కనిపించే పద్మం మహాలక్ష్మికి ప్రతీక. శుభానికి సంకేతం స్వస్తిక్, దీన్ని వినాయకుని రూపంగా కూడా భావిస్తారు. సూర్యభగవానునికి గుర్తుగా రథం ముగ్గులు.. ఇలా రకరకాల ముగ్గులు వేస్తున్నారు. హరిదాసు బొమ్మలు వేయడం, కుండతో పొంగలి ప్రసాదం, చెరకు వంటి బొమ్మలు వేసి మన సంప్రదాయాలను ప్రతిబింబించే విధంగా రంగవల్లికలను దిద్దుతున్నారు.

**ముఖ్యమైన ముగ్గులు ఇవే**

సంక్రాంతికి ముఖ్యమైన ముగ్గులు కొన్ని ఉన్నాయి. ఈ ముగ్గులు సంక్రాంతి పురుషుడిని ఆహ్వానించడం కోసం కూడా వేస్తారు. 12 ద్వారాల ముగ్గులు వేస్తారు. దీని ద్వారా వైకుంఠ ద్వారాలు తెరచినట్లుగా అర్థం వస్తుంది. మన పితృదేవతలు వైకుంఠానికి వెళ్లడానికి మార్గమని చెబుతారు. ఈ ముగ్గు కేవలం సంక్రాంతి రోజున మాత్రమే వేస్తారు.

- గుమ్మడికాయ ఆకారంలో వేసే ముగ్గు నెలగంటు నుంచి ధనుర్మాసం అంతా పెడతారు.
- రథం ముగ్గు మూడురోజుల పాటు వండగలను చేసుకొని సంక్రాంతి(వండుగ) పురుషుడిని ఆనందంగా సాగనంపేందుకు సూచికంగా వేస్తా రు. రథం తాడును మరొక ఇంటి వారి ముగ్గుతో కలుపుతూ పోతుంటారు. ఇది సహజీవనానికి సంకేతంగా నిలుస్తుంది. ఈ ముగ్గును కనుమ నాడు, ముక్కనుమ నాడు కూడా వేస్తారు. మకర సంక్రాంతి నుంచి సూర్యరశ్మిలో వేడిమి పెరిగి మంచు తొలగుతుంది. ఇన్ని రోజుల పాటు తీవ్రమైన చలిని ఎదుర్కొన్న ప్రజలు సూర్యుని ఆహ్వానిస్తూ ఈ రథం ముగ్గును వేస్తారు.

**కల్లాపితో వ్యాధులు దూరం..**

మకర సంక్రాంతిలో గ్రామీణ ప్రాంతాల్లో తెల్లవారు జామున ఆవుపేడతో వాకిలిలో కల్లాపి చల్లి ముగ్గు లు వేస్తారు. ముగ్గుల మధ్య పేడతో గొబ్బెమ్మలు పెట్టి పూలు పెడతారు. వీటి వల్ల క్రిమికీటకాలు, వ్యాధులు దూరమవుతాయి. ఈ ముగ్గుని వరిపిండితో ముగ్గుపిండిని కలిపి వేస్తారు. దీని వల్ల చిన్నచిన్న జీవులైన చీమలకు ఆహారం అందించినట్లుగా భావిస్తారు.

### సంప్రదాయాలకు ప్రతీక



ముగ్గులు మన సంప్రదాయానికి ప్రతీకగా నిలుస్తాయి. సందర్భానుసారంగా ముగ్గులు వేయడం జరుగుతుంది. పెళ్లి సమయంలో, పండగ సమయాలలో వేరేవేరే ముగ్గులు వేస్తాం. ఈ ధనుర్మాసంలో ప్రత్యేకంగా కొన్ని ముగ్గులు వేస్తాం.

- ఇప్పిలి భవానీ, గృహిణి, ఇప్పిలి వీధి, శ్రీకాకుళం



వైకుంఠ ద్వారాల ముగ్గు



చుక్కలతో రథం ముగ్గు



గుమ్మడికాయ ముగ్గు

## క్లుప్తంగా

### ఆప్కో చేనేత వస్త్రాలపై 30 శాతం తగ్గింపు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): ఆప్కో వస్త్రాలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు సంక్రాంతి సందర్భంగా అన్ని రకాల చేనేత వస్త్రాలపై 30 శాతం తగ్గింపు ఇస్తున్నట్లు ఆప్కో డివిజనల్ మార్కెటింగ్ అధికారి అనుపమ దాస్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రతి చేనేత కార్మికుడికి ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు ఈ కొనుగోళ్లు దోహదపడతాయని పేర్కొన్నారు. ధర్మవరం, మాధవరం, వెంకటగిరి, ఉప్పాడ, బందరు, రాజమండ్రి, మంగళగిరి చేనేత వస్త్రాలు, బెడ్‌షీట్స్, లుంగీలు, టవల్స్‌పై తగ్గింపు ఉంటుందని తెలిపారు. అన్ని ఆప్కో విక్రయశాలలతో పాటు 'ఆప్కో హ్యాండ్లూమ్స్ డాట్‌కామ్', అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి ఆన్‌లైన్ సంస్థల్లోనూ కొనుగోలు చేసి చేనేత పరిశ్రమను ప్రోత్సహించాలని కోరారు.

### మంత్రుల అవినీతి పెచ్చుమీరుతోంది

- ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

టెక్కలి: రాష్ట్రంలో మంత్రుల అవినీతి పెచ్చుమీరుతోందని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ ఆరోపించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే మంత్రి అచ్చెన్నాయుడు, హోంమంత్రి అనిత పేషీల్లో అవినీతి బహిర్గతం కావడం పాలకుల అవినీతికి నిదర్శనమన్నారు. మంత్రుల ఓఎస్డీలు చేస్తున్న అవినీతిలో ఆయా మంత్రుల ప్రమేయం ఉందని ఆరోపించారు. అవినీతి బయటపడినా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఎమ్మెల్సీ ప్రశ్నించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎక్కడా అవినీతి లేకుండా పారదర్శకంగా పాలన సాగిందని గుర్తు చేశారు.

### 25 మంది పందెంరాయుళ్లపై కేసు

ఎచ్చెర్ల క్యాంపస్: మండలంలోని కొంగరాం పంచాయతీ చినకొంగరాం సమీప తోటల్లో కోడి పందెం శిబిరాలపై పోలీసులు దాడి చేశారు. అజ్ఞాత వ్యక్తులు అందించిన సమాచారం ఎచ్చెర్ల ఎస్సై వి.సందీప్‌కుమార్ ఆధ్వర్యంలోని పోలీసులు వెళ్లగా 25 మంది పట్టుబడ్డారు. వీరిపై కేసు నమోదు చేసి రూ.38040 నగదు, నాలుగు కోడి పుంజులు, 16 బైక్‌లు, 20 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పేకాట, కోళ్ల పందాలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలు సాగించే వారిపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు పోలీసులు తెలిపారు.

### 'అణు' ప్రహరీ పనులు ప్రారంభం



జీరుకొవ్వాడలో నిర్మించిన ప్రహరీ

రణస్థలం: కొవ్వాడ అణువిద్యుత్ కర్మాగారం ఏర్పాటు నేపథ్యంలో న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ లిమిటెడ్ అధికారులు ప్రహరీ పనులు ప్రారంభించారు. జీరుకొవ్వాడ పరిధిలో రెండు కిలోమీటర్లు మేర ప్రహరీ నిర్మాణం పూర్తి చేశారు. త్వరలో కోటపాలెం రెవెన్యూ పరిధిలో ప్రహరీ నిర్మాణం చేపట్టనున్నామని అధికారులు తెలిపారు. అయితే భూ పరిహార సమస్యలు పరిష్కారమయ్యాకే ప్రహరీ పనులు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

### పోస్టుకార్డు క్యాలెండర్ అదరహో..




కంచిలి: ప్రతి ఒక్కరికీ సులభంగా రీతిలో, ముఖ్యంగా ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఉపయోగపడేలా 2025వ సంవత్సరపు క్యాలెండర్‌ను పోస్టుకార్డుపై తయారు చేసి అందరి ప్రశంసలు అందుకుంటున్నారు ప్రముఖ గణిత అవధాని మద్దు తిరుపతిరావు. దీనిని తయారు చేయడం కూడా చాలా సులభం. ఒక పోస్టుకార్డుపై నిలువుగా వృత్తం బొమ్మగీసి, అందులో మరో రెండు చిన్న వృత్తాలు ఒకదానిలో మరొకటి గీయాలి. బయట వృత్తాన్ని 12 భాగాలుగా చేసి ఒక్కొక్క భాగంలో నెలల పేర్లు వరుసగా జనవరి నుంచి డిసెంబర్ వరకు రాయాలి. వాటికి ఎదురుగా లోపల వృత్తంలో నెలల కోడ్స్ రాయాలి. మధ్యలో ఉన్న చిన్న వృత్తంలో 2025 సంవత్సరం రాసి దాని కింద ఉన్న దీర్ఘ చతురస్ర ఆకారపు పటంలో పైన వారం పేర్లు, వాటికి ఎదురుగా 0 నుంచి 6 వరకు కోడ్స్ రాయాలి. అంతే క్యాలెండర్ సిద్ధం. దీనిలో వారం పేరు తెలుసుకోవడం చాలా సులువు. ఉదాహరణకు 14.01.2025వ తేదీ ఏ వారం అవుతుందో తెలుసుకోవాలంటే.. వృత్త పటంలో జనవరి నెల కోడ్ 3ను తేదీ 14కు కలుపగా 17 వస్తుంది. ఈ 17ను 7 చే భాగించగా శేషం 3 వస్తుంది. ఈ 3ను వారంలో పట్టికలో చూడగా 3కు ఎదురుగా మంగళవారం అని ఉంటుంది. అంటే 14-01-2025వ తేదీ మంగళవారం అవుతుంది. ఇదే తరహాలో పోస్టు కార్డుపై అడ్డంగా గీతలు గీసి కూడా మరో క్యాలెండర్‌ను తిరుపతిరావు తయారు చేశారు.

# ఉద్దానంలో కార్గో కార్చిచ్చు!

- కార్గో ఎయిర్‌పోర్టు కోసం సుమారు 1400 ఎకరాల భూముల సేకరణ
- వ్యతిరేకిస్తున్న 18 గ్రామాల రైతులు
- నేడు పలాస ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా




ఎం.గంగువాడలో సన్నాహక ధర్నా సమావేశంలో పాల్గొన్న రైతులు

పలాస : పచ్చని ఉద్దానం ప్రాంతం పరిధిలోని తీర గ్రామాల్లో అలజడి రేగింది. ఓ పక్క అందాల తీర ప్రాంతం, మరో పక్క కోనసీమను తలపించే జీడి మామిడి, కొబ్బరి వంటి ఉద్యాన వన పంటలకు ఆవాసమైన, ఇక్కడి ప్రజల జీవనాధారమైన భూముల్లో కార్గో గ్రీన్ ఎయిర్‌పోర్టు ఏర్పాటు చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సిద్ధం కావడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం గ్రామాల్లో ఎక్కడికక్కడ సభలు, సమావేశాలు నిర్వహిస్తూ, నిరసన తెలియజేస్తూ ప్రభుత్వ ప్రతిపాదనను విరమించుకోవాలని నినదిస్తున్నారు. కార్గో పోర్టు ఏర్పాటైతే పలాస నియోజకవర్గం పరిధిలోని మందస, వజ్రపుకొత్తూరు మండలాల పరిధిలోని 18 గ్రామాలకు సంబంధించిన సుమారు 1800 మందికి చెందిన 14వేల ఎకరాల భూమిని కోల్పోవాల్సి ఉంటుంది. జీవనాధారమైన భూములు పోతే, తమ గ్రామాలు అక్కడ కనుమరుగైతే తమ పిల్లల పరిస్థితి ఏంటని ఆయా గ్రామాల రైతులు ప్రశ్నిస్తున్నారు. ఇంత అలజడి ఆ గ్రామాల్లో ఉన్నా కనీసం ప్రభుత్వం అధికారులు స్థానికులతో సమావేశాలు ఏర్పాటు చేసి అభిప్రాయాలు తీసుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే పలాస ఆర్డీవో కార్యాలయం వద్ద సోమవారం ఉదయం భారీ ఎత్తున ధర్నా కార్యక్రమం చేపడుతున్నారు. ఈ మేరకు గ్రామాల్లో సన్నాహక సమావేశాలు ఏర్పాటు చేసి ప్రజలను కదిలిస్తున్నారు.

**ఎవరి కోసమీ ఎయిర్‌పోర్టు?**

ఉద్దానం ప్రాంత ప్రజలకు అవసరం లేని ఈ కార్గో గ్రీన్ ఎయిర్‌పోర్టు ఎవరి ప్రయోజనాల కోసమంటూ అక్కడి ప్రజలు, ప్రజా సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. కేవలం వ్యవసాయ, ఇతర ఉత్పత్తులను ఇక్కడి నుంచి ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు దిగుమతులు చేయడానికేని, ఇందులో ఈ ప్రాంత ప్రజలకు ఏ మాత్రం ఉపయోగం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంతబొమ్మాళి మండలం, వజ్రపుకొత్తూరు మండలాల సరిహద్దులో నిర్మితమవుతున్న మూలపాడు పోర్టు, అలాగే భవిష్యత్తులో నెల్లూరు జిల్లా తడ నుంచి శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం వరకు సుమారు 935 కిలోమీటర్ల పొడవున తీరం వెంబడి 8 లేన్ల జాతీయ రోడ్లు ప్రతిపాదనలు కూడా ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే సరుకు రవాణా ఎయిర్‌పోర్టును నిర్మించి కార్పొరేటు సంస్థలకు ధారాదత్తం చేయడానికి ప్రభుత్వాలు పథకాలు రచిస్తున్నాయని ఇక్కడి ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రశ్నలకు ప్రభుత్వ అధికారులు సమాధానాలు చెప్పి నివృత్తి చేయాల్సిన అవసరం ఉంది. అలా చేయకపోతే మరో కాకరాపల్లి, బీల ఉద్యమాలు రాక తప్పదని ప్రజా సంఘాల నేతలు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు ఆయా ప్రాంతాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి వారి అనుమానాలను నివృత్తి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

| మండలం | గ్రామం | సేకరిస్తున్న జిరాయితీ | ప్రభుత్వ భూమి | మొత్తం (ఎకరాల్లో) |
|---|---|---|---|---|
| మందస | బిడిమి | 673.63 | 254.98 | 928.61 |
| మందస | బేతాళపురం | 94.2 | 0.67 | 94.87 |
| మందస | లక్ష్మీపురం | 24.45 | 0 | 24.45 |
| వజ్రపుకొత్తూరు | చీపురుపల్లి | 115.12 | 12.45 | 127.57 |
| వజ్రపుకొత్తూరు | మెట్టూరు | 180.19 | 27.02 | 207.21 |
| | మొత్తం | 1089.59 | 295.19 | 1389.71 |




గ్రీన్ కార్గో ఎయిర్ పోర్టు రూట్ మ్యాప్

# ఉద్యోగుల పెన్నిధి పురుషోత్తంనాయుడు




చౌదరి పురుషోత్తంనాయుడు, అరుణమ్మ దంపతులను సత్కరిస్తున్న ఏపీఎన్‌జీజీఓస్, జేఏసీ నాయకులు

శ్రీకాకుళం అర్బన్ : ఉద్యోగ, ఉపాధ్యాయుల పాలిట పెన్నిధిలా నిలుస్తూ వారిని ముందుండి నడిపించడంలో చౌదరి పురుషోత్తంనాయుడు విశేష సేవలు అందించారని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. జిల్లా కేంద్రంలోని 80ఫీట్ రోడ్‌లో ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం పురుషోత్తం నాయుడు ఉద్యోగ విరమణ ఆత్మీయ అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పి.అశోక్‌బాబు మాట్లాడుతూ కుటుంబం కంటే ఉద్యోగులకే అధిక ప్రాధాన్యమిస్తూ రాష్ట్ర సంఘంలో తనదైన ముద్ర వేశారని కొనియాడారు. మాజీ రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు మాట్లాడుతూ ఉద్యోగ సంఘ కష్టసుఖాల్లో వెన్నంటే నడుస్తూ ఎంతోమందికి ఆదర్శంగా నిలిచారని ప్రశంసించారు. మాజీ కేంద్రమంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి మాట్లాడుతూ పురుషోత్తం నాయుడు సేవలను కొనియాడారు. ఏపీఎన్‌జీజీవోస్ రాష్ట్ర సంఘ అధ్యక్షుడు కె.శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎ.విద్యాసాగర్ తదితరులు మాట్లాడుతూ ఉద్యోగిగా జీవితం ప్రారంభించి ఇంతటి గొప్ప నాయకుడిగా ఎదిగి తల్లిదండ్రులు, తోటి ఉద్యోగుల సమక్షంలో పదవీ విరమణ సత్కారం పొందడం గొప్పవరమన్నారు. అనంతరం ఉద్యోగ సంఘ నాయకులు, జేఏసీ ప్రతినిధులు, ఉపాధ్యాయులు పెద్దఎత్తున పురుషోత్తంనాయుడు, అరుణమ్మ దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, ఏపీఎన్‌జీజీఓస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.విద్యాసాగర్, కమర్షియల్ ట్యాక్స్ కమిషనర్ రవిశంకర్, రాష్ట్ర జిల్లా సంఘ నాయకులు జేవీఎం శర్మ, తోట రాజశేఖర్, బి.నాగరాజు, మురళీకృష్ణ, హనుమంతు సాయిరాం, చల్లా శ్రీనివాసరావు, శ్యామ్, రాణీమోహన్, కె.పద్మజ, చౌదరి బాబ్జి, చౌదరి ధనలక్ష్మి, జాన్ బాషా, రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, బి.మల్లేశ్వరరావు, దుప్పల వెంకటరావు, చంద్రశేఖర్, చౌదరి సతీష్, కుటుంబ సభ్యులు, వివిధ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు



మాట్లాడుతున్న మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు

# కొలువు లేక.. జీతం అందక..

- తొలగింపునకు గురైన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు తప్పని పాట్లు



అంబేడ్కర్ యూనివర్సిటీ

ఎచ్చెర్ల క్యాంపస్: కొలువు లేక, చివరి నెల జీతం అందక ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో డిసెంబర్ 31వ తేదీన 34 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను తొలగించిన సంగతి తెలిసిందే. గుంటూరు జిల్లా తాడేపల్లి ఏజీఎస్ మేనేజ్‌మెంట్ ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ కాంట్రాక్టును సైతం రద్దు చేశారు. ఈ ఉద్యోగులకు పనిచేసిన 12 నెలలకు గతంలో సెప్టెంబర్‌లో ఐదు నెలలు, డిసెంబర్‌లో ఆరు నెలల వేతనం అందజేశారు. డిసెంబర్ వేతనం ఏజెన్సీకి చెల్లిస్తే ఉద్యోగుల ఖాతాల్లో జమ అవుతుంది. ప్రస్తుతం సంక్రాంతి పండుగ ముందు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు బకాయి నెల జీతం కోసం ఎదురు చూస్తున్నారు. ఉద్యోగాల తొలగింపు, చివరి నెల వేతనం చెల్లించకపోవడంతో వారంతా ఆందోళన చెందుతున్నారు. వర్సిటీలో మిగతా ఉద్యోగులకు మాత్రం వేతనాలు చెల్లించారు.

**ముఖం చాటేస్తున్న అధికారులు..**

34 ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల నియమకాలను అప్పట్లో రెండు కేటగిరీల్లో చేపట్టారు. తొమ్మిది పోస్టులను మృతిచెందిన కాంట్రాక్టు ఉద్యోగుల కుటుంబ సభ్యులకు ఇచ్చారు. వీరంతా శనివారం ఉన్నతాధికారులను కలిసే ప్రయత్నం చేయగా నిరాశే ఎదురైంది. అధికారులు బీజీగా ఉన్నారని, కలవటం కుదరదని పీఏలు చెబుతున్నారు. మరోవైపు భవిష్యత్తులో తీసుకోవాల్సిన చర్యలపై ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు చర్చిస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక నోటిఫికేషన్లతో సంబంధం లేకుండా పదుల సంఖ్యలో సిఫారసులు ఆధారంగా కాంట్రాక్టు పద్ధతిలో అధికారుల నియామకాలు చేపట్టారు. అటువంటిది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులపై కక్ష కట్టడాన్ని వర్సిటీ వర్గాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. వర్సిటీ పరిణామాలపై ఎప్పటికప్పుడు ఉన్నత విద్యాశాఖ అధికారులకు విశ్వవిద్యాలయ పరిరక్షణ కమిటీ పేరుతో ఫిర్యాదులు వెళుతున్నాయి.

### 11న రథసప్తమి పనులకు టెండర్లు



వై.భద్రాజీ, ఆలయ ఈవో

అరసవల్లి: వచ్చే నెల 2, 3, 4వ తేదిల్లో జరగనున్న రథసప్తమి మహోత్సవానికి సంబంధించి పలు పనులకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయం ఈవో వై.భద్రాజీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 11న ఆలయ మండపాల్లో షార్టు సీల్డ్, బహిరంగ టెండర్ నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల వారికి ఆలయ కార్యాలయంలో ఈ నెల 8 నుంచి దరఖాస్తులు(టెండర్ షెడ్యూల్) అందజేస్తామని.. వీటిని కార్యాలయంలో సమర్పించిన వారు ఈ నెల 11వ తేదీ ఉదయం 11 గంటల నుంచి జరిగే టెండర్ ప్రక్రియలో పాల్గొనే అవకాశముంటుందని వివరించారు. విద్యుత్ అలంకరణ, క్యూలైన్ల ఏర్పాట్లు, షామియానాలు, కార్పెట్లు వేయడం, ఆలయ పరిసరాల్లో రంగులు వేయడం, ఫొటోలు, వీడియోగ్రఫీ, ఎల్ఈడీ స్క్రీన్స్, సీసీ కెమెరాల ఏర్పాటుతో పాటు డ్యూటీ సిబ్బందికి టీ,టిఫిన్, భోజనాలు సమకూర్చే హక్కులకు గాను టెండర్లు పిలుస్తున్నట్లు పేర్కొన్నారు.

### 8వ తేదీ దేహదారుఢ్య పరీక్షలు 11కి వాయిదా

శ్రీకాకుళం క్రైమ్ : ఆంధ్రప్రదేశ్ స్టేట్ లెవెల్ రిక్రూట్‌మెంట్ బోర్డు షెడ్యూల్ అనుసరించి జిల్లాలో ఈ నెల 8న జరగాల్సిన పోలీస్ కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షలు వైకుంఠ ఏకాదశి, ఇతర శాంతిభద్రతల దృష్ట్యా 11వ తేదీకి వాయిదా వేశారు. ఈ మేరకు ఎస్పీ మహేశ్వరరెడ్డి ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. మిగిలిన తేదీల్లో పరీక్షలు యథావిధిగా జరుగుతాయని ఎస్పీ పేర్కొన్నారు.

# నాణ్యత లేని డీజిల్ విక్రయం

- ట్రాక్టర్ పాడైందని యజమాని ఆందోళన



డీజిల్‌లో నీరు కలిసిందని క్యాన్‌ను చూపుతున్న కూర్మారావు, ట్రాక్టర్ డ్రైవర్

నరసన్నపేట: మండలంలోని గుండవల్లిపేట వద్ద భారత్ పెట్రోలియం బంకులో డీజిల్ నాణ్యతగా లేదని జలుమూరు మండలం గుండువలసకు చెందిన ట్రాక్టర్ యజమాని కూర్మారావు ఆరోపించారు. శనివారం తన డ్రైవర్ మూడు వేల రూపాయల డీజిల్‌ను ట్రాక్టర్‌లో వేసి పొలానికి వెళ్లగా మొరాయించిందని, మెకానిక్‌కు చూపిస్తే డీజిల్‌లో నీరు కలవడం వల్ల ఇంజిన్ సీజ్ అయిందని చెప్పాడని పేర్కొన్నారు. ఈ విషయమై బంకు సిబ్బందిని ప్రశ్నించగా ఎదురుదాడికి దిగారని ఆవేదన వ్యక్తం చేశారు. తాము డీజిల్ కొన్నట్లు బంకులో సీసీ కెమెరాల్లో కూడా రికార్డ్ అయ్యిందని, నాణ్యత లేని డీజిల్ విక్రయాలు చేస్తే ఎలా అని ప్రశ్నించారు. విషయాన్ని నరసన్నపేటలో రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోలేదని, న్యాయం కోసం సోమవారం కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేస్తామని కూర్మారావు తెలిపారు. ఈ విషయమై బంకు సిబ్బంది వద్ద 'సాక్షి' ప్రస్తావించగా పొంతన లేని సమాధానాలు చెప్పి తప్పించుకోవడానికి ప్రయత్నించారు.

# రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాల పంట

- పెన్‌కాక్ సిలాట్, కిక్ బాక్సింగ్‌లో రాణించిన సిక్కోలు క్రీడాకారులు



పతకాలు సాధించిన బాలబాలికలతో సీఐ ఈశ్వరరావు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఏ రంగంలో రాణించాలన్న పట్టుదల అవసరమని శ్రీకాకుళం రెండో పట్టణ సీఐ ఈశ్వరరావు అన్నారు. శ్రీకాకుళంలోని సాయిబాబా హేమంత్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు తాజాగా విశాఖపట్నంలో జరిగిన రాష్ట్రస్థాయి పెన్‌కాక్ సిలాట్, కిక్ బాక్సింగ్ పోటీల్లో పతకాల పంట పండించారు. పెన్‌కాక్ సిలాట్‌లో 12 బంగారు, 6 రజత, 6 కాంస్య పతకాలతో కలిపి 24 పతకాలు, కిక్ బాక్సింగ్‌లో కీర్తిక్ బంగారు పతకం సాధించి ఢిల్లీలో జరిగే జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా శ్రీకాకుళంలో ఆదివారం క్రీడాకారులతోపాటు కోచ్‌లు వై.హేమంత్‌కుమార్, డి.హరీష్‌లను సత్కరించారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కొంక్యాణ వేణుగోపాల్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ గవర్నర్ గేదెల ఇందిరాప్రసాద్, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు ఎన్ని సూర్యారావు, న్యాయవాది కొంక్యాణ సుభాష్, అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొన్న మధుసూదనరావు, ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముని శ్రీనివాసరావు, బి.సాయి, శ్రీనివాస్‌రెడ్డి, బరాటం నాగరాజు, నాగేంద్రయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# మూడు తులాల పుస్తెలతాడు చోరీ

మెళియాపుట్టి: పట్టపగలు మహిళమెడలో బంగారు పుస్తెలతాడు చోరీ చేసిన సంఘటన మెళియాపుట్టి ఏకలవ్య పాఠశాల సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై రమేష్‌బాబు తెలిపిన వివరాల మేరకు.. ఆదివారం కోటబొమ్మాళి మండలం సుబ్బారావుపేట గ్రామానికి చెందిన బాడాన రమణమ్మ భర్త అప్పన్నతో కలిసి మెళియాపుట్టి మండలం కొసమాల గ్రామంలో ఉన్న కోడలి ఇంటికి ద్విచక్ర వాహనంపై బయల్దేరింది. మెళియాపుట్టి శివారులోని ఏకలవ్య పాఠశాల సమీపంలో వెనుక నుంచి ద్విచక్రవాహనంపై వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి వీరికి దగ్గరగా వచ్చి రమణమ్మ మెడలోని మూడు తులాల బంగారు పుస్తెలతాడు తెంచుకుని మెళియాపుట్టి వైపు పరారయ్యాడు. దీంతో బాధితులు మెళియాపుట్టి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. పాతపట్నం వైపు చైన్‌స్నాచర్ వెళ్లి ఉండవచ్చనే అనుమానంతో సీసీ ఫుటేజీలు పరిశీలిస్తామని చెప్పారు.

# నూర్పిడి యంత్రాన్ని ఢీకొట్టిన కారు




ఘటనా స్థలంలో నుజ్జయిన కారు

- స్వల్ప గాయాలతో బయటపడిన కుటుంబ సభ్యులు
- గుండువల్లిపేట వద్ద తప్పిన ఘోర ప్రమాదం

నరసన్నపేట: జాతీయ రహదారిపై ఆదివారం వేకువజామున పెను ప్రమాదం తప్పింది. వేకువజామున 4.45 గంటల సమయంలో గుండువల్లిపేట వద్దకు వచ్చే సరికి రోడ్డు పక్కన ఆగి ఉన్న నూర్పు యంత్రాన్ని ఓ కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు నామరూపాలు లేకుండా నుజ్జునుజ్జయ్యింది. అదృష్టవశాత్తు కారులో ఉన్న తల్లీకుమార్తెలు కె.మమత, కె.పూజలు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కారు నడుపుతున్న వ్యక్తికి ఎటువంటి గాయాలు కాలేదు. వీరంతా విశాఖపట్నం జిల్లాకు చెందిన వారు. వ్యక్తిగత పని నిమిత్తం జార్ఖండ్ వెళ్లారు. తిరిగి వస్తుండగా పొగమంచు.. అతి వేగం కారణంగా ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. కారు ప్రమాదానికి గురైన వెంటనే స్థానికులు స్పందించి 108కు సమాచారం అందించడంతో సిబ్బంది వచ్చి గాయపడ్డ వారిని బయటకు తీసి శ్రీకాకుళంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. ప్రమాద సమయంలో కారులో బెలూన్స్ తెరుచుకోవడం, ముగ్గురూ సీట్ బెల్ట్ ధరించడంతో ప్రాణాపాయం తప్పినట్లు తెలుస్తోంది. గాయపడ్డ ఇద్దరూ ఆరోగ్యంగానే ఉన్నారని నరసన్నపేట ఎస్ఐ సీహెచ్ దుర్గాప్రసాద్ తెలిపారు.

# కళాశాల అధ్యాపకుల సంఘం కార్యవర్గ ఎన్నిక



కార్యవర్గాన్ని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సురేఖ

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుల సంఘం (జీసీజీటీఏ) జిల్లాస్థాయి నూతన కార్యవర్గం ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో జరిగిన ఈ ఎన్నికల్లో జీసీజీటీఏ జిల్లా నూతన అధ్యక్షుడిగా డాక్టర్ ఎస్.సాయికుమార్, కార్యదర్శిగా డాక్టర్ ఆర్.రవిశంకర్, కోశాధికారిగా డాక్టర్ పి.రామారావు, ఉపాధ్యక్షుడిగా లబ్బ కృష్ణారావు ఎన్నికయ్యారు. పరిశీలకునిగా డాక్టర్ సీహెచ్ విష్ణుమూర్తి (జీసీడీ కామర్స్– భీమునిపట్నం) వ్యవహరించారు. నూతన కార్యవర్గానికి ప్రిన్సిపాల్స్ డాక్టర్ పి.సురేఖ, డాక్టర్ కె.సూర్యచంద్రరావు, డాక్టర్ ఎస్.చిన్నారావు, సమగ్రశిక్ష ఏపీసీ డాక్టర్ ఎస్.శశిభూషణ్, డాక్టర్ పీవీ రమణ, సీహెచ్ రామ్మూర్తి, డాక్టర్ మోహనరాజు తదితరులు అభినందనలు తెలియజేశారు.

# సాహిత్యసేవ అభినందనీయం



హంసవాహిని పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు, నిర్వాహకులు

శ్రీకాకుళం కల్చరల్: తెలుగు రచయితలు చేస్తున్న సాహిత్య సేవ అభినందనీయమని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ బి.ఆర్.రజిని తెలిపారు. తెలుగు రచయితల వేదిక(తెరవే) ఆధ్వర్యంలో 100వ నెలవారీ సాహితీ సమ్మేళనం నగరంలోని శాంతినికేతన్ కళాశాలలో ఆదివారం నిర్వహించారు. సంస్థ అధ్యక్ష కార్యదర్శులు ఉత్తరావల్లి నాగేశ్వరరావు, ఆర్.వి.రమణమూర్తి నిర్వహణలో తెరవే రూపొందించిన 'హంసవాహిని' కవితా సంకలనం పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కవులు, రచయితలు తమ రచనలతో సమాజాన్ని అభ్యుదయ పథంలో నడిపించాలని కోరారు. రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, విశ్రాంత సెట్‌శ్రీ సీఈవో సురంగి మోహనరావులు మాట్లాడుతూ వంద నెలల పాటు ప్రతి నెలా సాహిత్య సమ్మేళనం నిర్వహించడం గొప్ప విషయమన్నారు. అధ్యక్షుడు నాగేశ్వరరావు మాట్లాడుతూ కవుల రచనలు చిరస్థాయిగా నిలిచిపోయేలా గ్రంథస్తం చేయాలని కోరారు. కార్యదర్శి రమణమూర్తి మాట్లాడుతూ తెరవే కవుల రచనలతో హంసవాహిని 5వ పుస్తకంగా వెలువడిందని తెలిపారు. కార్యక్రమంలో విశ్రాంత డీఈవో మల్లేశ్వరరావు, ప్రొఫెసర్ జి.లీలాప్రసాదరావు, హిందీ మంచ్ ఉత్తరాంధ్ర అధ్యక్షుడు కోనె శ్రీధర్, సంస్థ సభ్యులు డాక్టర్ కోమల రావు, ఇద్ది పాపయ్య, నిక్కు హరిసత్యనారాయణ, ఐఎన్డీ ప్రసాద్, కిల్లాన శ్రీనివాస్, వి.రాజారావు, ముట్నూరు ఉపేంద్రశర్మ, భోగెల ఉమామహేశ్వరరావు, పూడి జనార్దన్, కుప్పిలి త్రినాథరావు, ఎస్.ఈశ్వరరావు, బాలాజీ రవికిరణ్ పాల్గొన్నారు.